సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం : 21 : జూన్ : 2025

I



ఆక్వాకు వాతావరణ గండం
వాతావరణంలో మార్పులు ఆక్వా సాగుకు గుదిబండలా మారాయి. దీంతో రొయ్యల రైతులు ఇబ్బంది పడుతున్నారు. IIలో ▸



యోగాసనం.. ఆరోగ్య రహస్యం
శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కల్పించే యోగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం. IIలో ▸



112 బస్సులపై కేసులు
కలపర్రు టోల్‌గేట్ వద్ద 112 కాంట్రాక్టు క్యారేజ్ బస్సులు, వాణిజ్య, వాణిజ్యేతర వాహనాలపై అధికారులు కేసులు నమోదుచేశారు. IIలో ▸

బస్సులు లేక.. ప్రయాణం సాగక

రవాణా కష్టాలు
- బస్సులన్నీ విశాఖకు తరలింపు
- ఉమ్మడి పశ్చిమ నుంచి 355 బస్సులు
- బస్టాండ్లలో ప్రయాణికుల అవస్థలు
- గంటల తరబడి ఎదురుచూపులు
- కళాశాల విద్యార్థులకు ఆటోలే దిక్కు
- జిల్లాలో 40 శాతమే నడిచిన సర్వీసులు



ప్రయాణికుల పడిగాపులు.. ఏలూరు కొత్త బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: లక్షలాది మంది ప్రజల రాకపోకలతో బస్టాండ్లు కిటకిటలాడుతుంటాయి. వేలాది మంది విద్యార్థులు, ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణాలకు రావడానికి కీలక వారధిగా ఉండే ప్రజా రవాణా వ్యవస్థ శుక్రవారం స్తంభించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 60 శాతానికిపైగా బస్సులు విశాఖ జిల్లాకు తరలించడంతో బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్న పరిస్థితి. మరోవైపు చుట్టుపక్కల గ్రామాలకు ఆటోలే దిక్కు అయ్యాయి. శనివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా డేకు జిల్లాలోని బస్సులు తరలించడంతో ప్రజా రవాణా నిలిచిపోయింది.

7 డిపోలు.. 355 బస్సులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 7 డిపోల నుంచి 355 బస్సులను విశాఖ సభకు ప్రభుత్వం కేటాయించింది. అన్ని డిపో మేనేజర్లకు ఉత్తర్వులు రావడంతో గురువారం సాయంత్రం నుంచే విడతల వారీగా బస్సులను పంపారు. మొత్తంగా ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల్లో కలిపి 305 సర్వీసులు, అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో 305 సర్వీసులు ఉన్నాయి. శుక్రవారం అన్ని బస్టాండల్లో ప్రయాణికుల రద్దీతో పాటు గంటలతరబడి పడిగాపులు అనివార్యంగా కొనసాగాయి. 80 శాతం ఆక్యూపెన్సీతో ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. ప్రధానంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, తణుకు ఇలా అన్ని ప్రధాన ప్రాంతాలకు చుట్టుపక్కల వందల గ్రామాల నుంచి రోజూ సగటున 60 వేల మందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు. దీనిలో ఆర్టీసీలోనే సుమారు 25 వేల మందికిపైగా రాకపోకలుంటాయి. అలాగే కళాశాల విద్యార్థులు కూడా అత్యధికంగా ప్రజా రవాణానే వినియోగిస్తుంటారు. ఈ పరిణామాల క్రమంలో బస్సులన్నీ విశాఖకు తరలించడంతో అన్ని ప్రాంతాల్లో రాకపోకలు కొంతమేర స్తంభించాయి.

ప్రయాణికులకు చుక్కలే.. ఏలూరు బస్టాండ్ నుంచి విజయవాడకు రోజూ 72 ట్రిప్పులు నాన్‌స్టాప్ సర్వీసులు నడుపుతున్నారు. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు అన్నీ కలుపుకుని ఏలూరు నుంచి 150 వరకు సర్వీసులు ఉన్నాయి. శుక్రవారం దాదాపు 70 శాతం సర్వీసులకు బస్సులు లేకపోవడంతో నామమాత్రంగా సర్వీసులను నడిపారు. అలాగే ఏలూరు నుంచి రాజమండ్రి, రావులపాలెంకు 6 సర్వీసులుండగా వాటిని రెండింటికి పరిమితం చేశారు. రోజూ ఒక్క ఏలూరు డిపో నుంచి 19 నుంచి 20 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇక జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది విద్యార్థులకు ఆటోలే దిక్కయ్యాయి. అలాగే విజయవాడకు ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాలే అనివార్యమయ్యాయి. ఏలూరు జిల్లాలోని ఏలూరు డిపో నుంచి 80 బస్సులు, జంగారెడ్డిగూడెం డిపో నుంచి 52 బస్సులు, నూజివీడు డిపో నుంచి 38 బస్సులు విశాఖకు పంపారు. అవసరమైతే మరో 50 బస్సులు పంపడానికి అధికారులు ముందస్తు ఏర్పాట్లు కూడా చేశారు.

'పశ్చిమ'లోనూ ఇదే పరిస్థితి

పశ్చిమగోదావరి జిల్లాలో 305 బస్సులకుగాను 185 బస్సులను విశాఖకు తరలించారు. భీమవరం డిపో నుంచి 51, నరసాపురం డిపో నుంచి 41, తాడేపల్లిగూడెం డిపో నుంచి 41, తణుకు డిపో నుంచి 52 బస్సులు శుక్రవారం విశాఖకు పంపారు. ప్రధానంగా భీమవరం నుంచి విజయవాడ, ఏలూరుకు 40 బస్సులు, భీమవరం నుంచి తణుకు, తాడేపల్లిగూడెంకు మరో 40 బస్సులు 90 శాతం ఆక్యూపెన్సీతో రాకపోకలు సాగిస్తుంటారు. పూర్తి గ్రామీణ ప్రాంతాలు కావడంతో పల్లె వెలుగు సర్వీసులపైనే ఎక్కువగా ఆధారపడే పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సగటున రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు రోజువారీ ఆదాయం సమకూరుతుంది. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఆదివారం ఉదయం వరకు బస్సులు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా భీమవరం-పాలకొల్లు, భీమవరం-నరసాపురం, తాడేపల్లిగూడెం-తణుకు మధ్య తప్పని పరిస్థితుల్లో రెండు రోజులపాటు ఆటో ప్రయాణాలే ప్రజలకు దిక్కయ్యాయి.



ఏలూరు కొత్త బస్టాండ్‌లో చంటి బిడ్డతో అవస్థలు



ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు



బస్టాండ్‌లోని నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద..



బస్సు కోసం పరుగులు

న్యూస్‌రీల్

పని గంటల పెంపుపై మండిపాటు



భీమవరం ప్రకాశం చౌక్‌లో నిరసన

భీమవరం: రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక విధానం లేకుండా కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మండిపడ్డారు. రాష్ట్ర కేబినేట్ పని గంటల పెంపు, మహిళలు రాత్రి సమయాల్లో పనులు చేయడానికి అంగీకరిస్తూ తీసుకున్న నిర్ణయాలు కార్మికులకు ఇబ్బందులు కలిగించేలా ఉన్నాయంటూ శుక్రవారం స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్లపై దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం కనీసం పరిశీలించకుండా అంగీకరించడం దారుణమన్నారు. కార్మికుల ఆరోగ్యం, కనీస వేతనాల అమలును పట్టించుకోలేదన్నారు. అలాగే మద్యం, మత్తుపదార్థాల అనర్థాలు, మహిళలపై దాడులను అరికట్టడంతో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఏఐటీయూసీ నాయకుడు చెల్లబోయిన రంగారావు, టీయూసీసీ నాయకులు దండు శ్రీనివాసరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా డేకు పటిష్ట ఏర్పాట్లు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొనేలా చూడాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో నమోదైన 8.80 లక్షల మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. అలాగే భీమవరం కలెక్టరేట్ వద్ద 5 వేల మందితో నిర్వహించే యోగా కార్యక్రమం ఏర్పాట్లపైనా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టిన ఏర్పాట్లను రాత్రి కలెక్టర్ నాగరాణి జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లు, అధికారులు పరిశీలించారు.

మున్సిపల్ కార్మికుల దీక్షలు



తణుకులో దీక్షలో పాల్గొన్న కార్మికులు

తణుకు అర్బన్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) జిల్లా కార్యదర్శి గెల్లా విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తణుకు మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం కార్మికులు నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నా తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. జేఏసీ గౌరవ అధ్యక్షుడు మీసాల పాపారావు, అధ్యక్షుడు ఉండ్రాజవరపు శ్రీను, ఉపాధ్యక్షుడు పీతల శ్రీదేవి, ఉప కార్యదర్శి పడాల దానం జైసిల్‌రాజు, పిండి పెద్దిరాజు, జి.నాగబాబు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

భీమవరం: రైతులు తోలిన ధాన్యానికి ప్రభుత్వం సొమ్ములు చెల్లించకపోవడం దారుణమని, తక్షణం ధాన్యం బకాయిలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం డబ్బులు చెల్లించకుండా జాప్యం చేయడంతో రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సార్వా సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులకు చేతుల్లో డబ్బులు లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లాలో రైతులకు రూ.293 కోట్ల మేర బకాయిలు ఉన్నా నాయకులు నోరుమెదపకపోవడం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంల కారణంగా పథకాలు పొందడంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టిందన్నారు. రెవెన్యూ శాఖ సబ్ డివిజన్ సేవ కోసం రూ.50 రుసుం చెల్లిస్తే జాయింట్ పట్టాదారుల భూములకు ఉచితంగా సబ్ డివిజన్ చేస్తామన్నారు. ఈ అవకాశం నెలాఖరులోపు దరఖాస్తు చేసుకున్న వారికే వర్తిస్తుందన్నారు. ఈ మేరకు రైతులు సబ్ డివిజన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు భీమవరానికి బొత్స రాక

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నాయకులు

భీమవరం: భీమవరంలో శనివారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని కుముదవల్లి రోడ్డులోని నర్సయ్య అగ్రహారం వద్ద గల ఏఎస్ రాజు కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గత కొన్ని నెలలుగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త లేకపోవడం, ఇటీవల భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు చినమిల్లి వెంకట్రాయుడును సమన్వయకర్తగా నియమించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ఈ క్రమంలో జరిగే సమావేశానికి భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పార్టీ సత్తా చూపించడానికి సమాయత్తమవుతున్నారు. సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుతోపాటు ఆరు నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరుకానుండటంతో ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రహదారుల నిర్మాణంపై సమీక్ష

ఏలూరు(మెట్రో): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, తదితర సమస్యలను అధిగమించి త్వరితగతిన రహదారుల నిర్మాణం జరిగేలా చూడాలని ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం అధికారులతో ఆమె సమీక్షించారు. పట్టిసీమ-జీలుగుమిల్లి 365 బి.బి. 40 కి.మీ. రహదారికి సంబంధించి త్వరగా భూసేకరణ చేసి నిర్మాణదారులకు స్వాధీనం చేయాలని ఆదేశించారు. అలాగే ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సంబంధించి ఆయా అంశాలపై సమీక్షించారు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పామర్రు-ఆకివీడు 165 జాతీయ రహదారికి సంబంధించి గోనేపాడు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన భూమి విషయంలో రైతులతో సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారించాలన్నారు.

23న వైఎస్సార్‌సీపీ యువత పోరు



భీమవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సందీప్ తదితరులు

భీమవరం: కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేశారని, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 23న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ తెలిపారు. శుక్రవారం భీమవరంలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రతి నెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ గొప్పగా ప్రచారం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా యువతకు ఇచ్చిన ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించి యువతకు ఇచ్చిన హామీల అమలుకు తాము నిరసన బాటపట్టనున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు భీమవరం పట్టణ శివారు విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం అందిస్తామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సందీప్ కోరారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జనరల్ సెక్రటరీ పాము యోహాన, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రాజు, సన్నీ, చందు, జానీ, రాహుల్, ప్రవీణ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

సార్వాకు సన్నద్ధం

- జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 10,400 ఎకరాల్లో నారుమడులకు 1,500 ఎకరాల్లో పూర్తి
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు




నారుమడి పనుల్లో రైతులు

భీమవరం: జిల్లాలో రైతులు సార్వా వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో కొన్నిచోట్ల నారుమడుల పనులు చేస్తుండగా.. మరికొందరు విత్తనాల సేకరణ, దుక్కుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో సార్వా సీజన్‌లో 2.08 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనుండగా, ఈ మేరకు 10,400 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉంది. ఇప్పటివరకు దాదాపు 1,500 ఎకరాల్లో నారుమడులు పూర్తిచేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గత దాళ్వా సాగు చేపట్టిన రైతులు ధాన్యం అమ్మకాల సమయంలో మిల్లర్లు, ధాన్యం కమీషన్ ఏజంట్లు పంటకు తక్కువ ధర చెల్లించడంతో తీవ్రంగా నష్టపోయారు. నేటికీ కోట్లాది రూపాయలు ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో ప్రస్తుత సార్వా సాగు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

52 వేల క్వింటాళ్ల విత్తనాల అవసరం

జిల్లాలో వరి సాగుకు 52,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా దాదాపు 41,600 క్వింటాళ్లు రైతుల వద్దనే ఉంటాయనే అంచనా. 225 క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయ శాఖ సబ్సిడీపై రైతులకు అందించనుంది. 4,600 క్వింటాళ్ల విత్తనాలు ప్రైవేట్ డీలర్ల వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. సన్న రకాలను ప్రోత్సహించేందుకు ఎంటీయూ 1262 రకం వరి విత్తనాలను అన్ని మండలాల్లో దాదాపు 175 ఎకరాల్లో విత్తన పంటగా వేయించడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

ముందస్తు నాట్లతో మేలు



సార్వా పంటకు ముందస్తు నాట్లు వేయడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చు. ఇప్పటికే కాలువల్లో సంవృద్ధిగా నీరు ఉంది. వాతావరణం కూడా అనుకూలంగా ఉన్నందున రైతుల త్వరితగతిన నారుమడులు వేసుకోవాలి. దాదాపు 1,500 ఎకరాల్లో నారుమడులు పూర్తయ్యాయి. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, భీమవరం

58,900 టన్నుల ఎరువులు

జిల్లాలో 2.08 లక్షల ఎకరాల్లో సాగుకు 58,905 టన్నుల ఎరువులు అవసరముంటుంది. దీనిలో యూరియా 20,990 టన్నులు, కాంప్లెక్స్ 35,059 టన్నులు, డీఏపీ 2,700 టన్నులు అందుబాటులో ఉన్నాయి. వరిపైరుపై నానో యూరియా వాడకాన్ని ప్రోత్సహించడానికి జిల్లావ్యాప్తంగా 2 లక్షల ఎకరాలకు అవసరమైన నానో యూరియా, డీఏపీ ప్రైవేట్ మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు.

భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలి

అధికంగా ఎరువులు వాడకాన్ని తగ్గించడానికి రైతులకు భూసార పరీక్షల కార్డులు అందిస్తున్నారు. ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది. దీనిలో భాగంగా ఈ ఏడాది 16,150 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలకు తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు. వ్యవసాయ భూముల్లో నత్రజని, కర్బన శాతం, జింకు తక్కువగా గుర్తించారు. ఈ మేరకు రైతులకు భూసార పరీక్షల కార్డులు అందించి వాటి ఆధారంగా ఎరువులు వాడకంపై అవగాహన కల్పించనున్నారు.

రెవెన్యూ చట్టాలపై అవగాహన అవసరం



రెవెన్యూడే కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): రెవెన్యూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి, ప్రజలకు మంచి సర్వీసులను అందించడానికి రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్నందుకు గర్వపడాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు రూల్స్‌ను అనుసరిస్తూ పనిచేయాలని, పనితోనే గుర్తింపు లభిస్తుందన్నారు. రెవెన్యూ శాఖలో పని చేసి రిటైర్ అయిన తహసీల్దార్లు లక్కు నరసింహారావు, పాంచజన్యమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ బాబాజీ, వీఆర్వో బి.వెంకట సుబ్బారావు, ఆఫీస్ సబార్డినేట్ మణికంఠలను సత్కరించి జ్ఞాపికలు అందించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, భీమవరం ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.శివశంకర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

ఏలూరు (టూటౌన్): గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి బి.ఉమాకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 25న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాలురు 6వ తరగతికి 36, 7వ తరగతికి 3, 8వ తరగతికి 18, 9వ తరగతికి 11 సీట్లు, బాలికలకు 6వ తరగతికి 35, 9వ తరగతికి 2 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బాలికలకు వట్లూరు, ఏలూరులో, బాలురుకు పెదవేగి, ఏలూరు గురుకులాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

5వ తరగతిలో సీట్లకు కౌన్సెలింగ్ : గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బాలికలకు ఈనెల 22న వట్లూరులో, బాలురుకు 23న పెదవేగిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ర్యాంక్ కార్డు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

ప్రవేశాలకు మరో అవకాశం

భీమడోలు: బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలో సీట్లు పొందని వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు పోలసానిపల్లి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నంబూరి భారతి తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష రాసిన బాలికలు ఆదివారం ఉదయం 10 గంటలకు, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష రాసిన బాలికలు ఈనెల 26న ఉదయం 10 గంటలకు వట్లూరు గురుకుల కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

క్లుప్తంగా

వారణాసిలో ఆత్మహత్య చేసుకున్న దంపతులు



వారణాసిలో ఆత్మహత్య చేసుకున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వీమల్లు గంగారావు(75), అప్పాయమ్మ(70)వారణాసిలో గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లిన వారు అక్కడే చనిపోవాలని నిర్ణయించుకున్నారు. అక్కడ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. దీనిపై వారణాసి పోలీసులు భీమవరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కాళ్ల పోలీసులు మృతుల బంధువులకు శుక్రవారం సమాచారం అందించారు.

బంగారం వ్యాపారి ఆత్మహత్య



మృతుడు నారాయణ అప్పారావు(ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంకు చెందిన బంగారం వ్యాపారి నారాయణ అప్పారావు(48) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పారావు గతంలో తాడేపల్లిగూడెంలో బంగారం వ్యాపారం చేస్తుండేవాడు. అప్పులపాలడంతో ఏడాది క్రితం హైదరాబాద్ వెళ్ళిపోయాడు. బంధువులు ఒత్తిడి చేయడంతో తిరిగి తాడేపల్లిగూడెం వచ్చి వ్యాపారం మొదలు పెట్టాడు. ఇటీవల అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో భరించలేక రెండు రోజుల క్రితం ఇంట్లో వారికి చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఈనెల 20న రాజమండ్రి గోదావరి గట్టు వద్ద అప్పారావు మృతదేహం లభించింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రైల్వే గేటు సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. స్థానికంగా సెల్‌ఫోన్ మరమ్మతులు చేసే షేక్ నజీర్(35) తెల్లవారుజామున వాకింగ్ నిమిత్తం బయటకు వచ్చి రైల్వే ప్లాట్‌ఫారంపై వాకింగ్ చేసి, అనంతరం సిద్ధాపురం రైల్వే గేటు వద్ద నుంచి కొంత దూరం రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా.. అతన్ని వెనక నుంచి రైలు వచ్చి ఢీకొట్టింది. అతనికి వినికిడి లోపం ఉండటంతో రైలు శబ్దం తెలియలేదని తెలిసింది. ఆర్పీఎఫ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ఆకివీడు: స్థానిక సీపీఎం ఆఫీస్ రోడ్డులో నివశిస్తున్న బెజ్జవరపు శాంతి (25) శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఆమె పెద్దమ్మ బెజ్జవరపు లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ హెచ్.నాగరాజు వివరాలు వెల్లడిస్తూ.. ఎంబీఏ చదివిన శాంతి తల్లిదండ్రులు చనిపోవడంతో పెద్దమ్మ వద్దే ఉంటుంది. డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తున్న లక్ష్మి ఉదయం ఇంటి వద్ద పనిముగించుకుని డ్వాక్రా పని నిమిత్తం ఆఫీసుకువెళ్లి తిరిగి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలానికి చెందిన విద్యార్థినికి ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై ఏలూరు రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక ప్రాంతానికి చెందిన ఘంటసాల వెంకట శ్రీనివాస్ మండలానికి చెందిన బాలికతో సోషల్ మీడియాలో పరిచయం పెంచుకున్నాడు. బాలికను ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని నమ్మించాడు. ఈనెల 18న బాలికను తనతో తీసుకెళ్లి యువకుడి బంధువు ఇంట్లో ఉంచాడు. 19న రాత్రి వేళ బాలిక తన ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు శుక్రవారం రూరల్ ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యోగాసనం.. ఆరోగ్య రహస్యం

- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు



ఆకివీడు ఆదిత్య స్కూల్‌లో విద్యార్థుల యోగసనాలు



యోగాసనాలు

కైకలూరు/పాలకొల్లు సెంట్రల్: శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. భారతదేశంలో వేల ఏళ్ల నుంచి యోగాకు ప్రాచుర్యం ఉంది. 2014 డిసెంబరు 11న జరిగిన ఐక్యరాజ్య సమితి 69వ జనరల్ అసెంబ్లీలో అంతర్జాతీయ యోగా దినోత్సవంగా తీర్మానించారు. ఏటా జూన్ 21 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ ఏడాది ×యోగా ఒక భూమి, ఒక ఆరోగ్యం₹ అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

యోగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ఇది మనసును నియంత్రించడంతో పాటు మెదడును ఉత్తేజ పరుస్తోంది. పూర్వకాలంలో చరక, సుశ్రుత, ధన్వంతరి, పతంజలి, కపిలుడు వంటి రుషుల నుంచి, ఆధునిక యుగంలో రమణ మహర్షి, అరవింద యోగి, రామకృష్ణ పరమహంస, శివానంద, యోగానంద, బాబా రామ్‌దేవ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ వంటి ఎందరో యోగా విశిష్టతను చాటి చెప్పారు. ఈ ఏడాది ప్రత్యేకంగా 10 కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. యోగా పేరుతో సంగం, బంధన్, పార్క్, సమావేశ్, ప్రభావ, కనెక్ట్, హరిత్, అన్‌ప్లగ్డ్, మహాకుంభ్, సంయోగ పేరుతో వీటిని రూపొందించారు. ప్రధానంగా మహాసంగం పేరుతో 1,00,000 ప్రాంతాల్లో యోగా ప్రదర్శనలు ఇస్తున్నారు.

అష్టాంగ మార్గం.. అనుసరణీయం

యోగాలో యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అని 8 అంశాలు ఉంటాయి. నేటి సమాజంలో సూర్య నమస్కార ఆసనాలు ప్రాధాన్యత పొందాయి. వీటిలో ప్రణమాసనం, హస్త ఉత్థానాసనం, పాద హస్తాసనం, అశ్వ సంచాలనాసనం, పర్వతాసనం, భుజంగాసనం, సాష్టాంగాసనం ముఖ్యమైనవి. ఇక స్థూలకాయ నివారణకు త్రికోణ, హలన శలభ, నిద్రలేమికి హలాసనం, శీర్షాసనం, శీతలి, ప్రాణాయామం, మలబద్ధకానికి తాడ, చక్ర, మయూర, మత్స్యాసనాలు, నెలసరి ఇబ్బందులకు హల, గోముఖ, భద్ర, చంద్ర నమస్కారాలు వంటి ఉపయోగపడుతున్నాయి.

యోగాతో లాభాలు

- ధ్యాన సాధన క్రమంగా చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది.
- చదువు, ఉద్యోగ జీవితంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.
- దృష్టి ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ప్రశాంత కలుగుతోంది.
- ఆందోళన, అలసట వంటి సమస్యలు తగ్గుతాయి.
- ప్రాణాయామం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.
- దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం కలుగుతోంది.
- యోగాసనాలకు 45 నిమిషాల నుంచి గంటన్నర సమయం కేటాయించాలి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. మనసును ఆలోచన రహిత స్థితికి తీసుకురావడమే యోగా. క్రమం తప్పకుండా యోగ సాధన చేస్తే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్యవంతమైన జీవనం అలవడుతోంది. యోగా అంటే కేవలం ఆసనాలు కాదు. ప్రాణాయామం, ధ్యానం వంటి అనేక అంశాల కలయిక.

– డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు, యోగా గురువు, ఆకివీడు

యోగాతో జీవితంలో ఉత్సాహం



గత పదేళ్లుగా యోగా చేస్తున్నాను. చాలా ఉత్సాహంగా ఉంటుంది. మొదట్లో కొద్దిగా కష్టంగా అనిపించినా చేయగా చాలా ఉపయోగాలు కనిపించాయి. ఎంత పని ఉన్నా యోగా చేసిన తరువాతే ఏ పనైనా చేసుకుంటాను.

– మేకా లక్ష్మి, గృహిణి, పాలకొల్లు

శ్వాస సమస్యలకు పరిష్కారం



యోగాతో శ్వాసకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకోవచ్చు. నేడు కనీసం మెట్లు ఎక్కలేని స్థితిలో కొందరు ఉన్నారు. యోగా శిక్షణ తీసుకున్న వ్యక్తుల్లో అలాంటి సమస్యలు పోతాయి. గత 16 ఏళ్లుగా యోగా చేస్తున్నాను. శిక్షణకు రోజుకు సుమారు 40 నుంచి 50 మంది వరకూ వస్తుంటారు.

– గమిని ఆనంద్, యోగా శిక్షకుడు, పాలకొల్లు

నడుం నొప్పులకు విముక్తి



రోజూ యోగా చేస్తుంటే ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. నడుం నొప్పి ఉండేది. యోగా చేస్తూ ఆ సమస్యను పరిష్కరించుకున్నాను. అప్పటి నుంచి నిత్యం యోగా సాధనకు వస్తున్నాను. యోగా, ప్రాణాయామం, ధ్యానంతో అన్ని రుగ్మతలు దూరం చేసుకోవచ్చు.

– నంబూరి స్వామి, పాలకొల్లు

తల్లికి వందనంపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కామవరపుకోట: కరెంట్ బిల్లు సాకుతో 'తల్లికి వందనం ఎగనామం' పేరిట సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక కొత్తూరు యానాదుల కాలనీకి చెందిన చౌటూరి కోటమ్మ ఇద్దరు పిల్లలు తల్లికి వందనం పథకానికి అర్హులయినప్పటికీ ఆమెకు 300 యూనిట్లకు పైగా విద్యుత్ బిల్లు వచ్చినట్లు చూపించి అనర్హులుగా చూపించారు. దీంతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి కెఆర్‌పురం ఐటీడీఏ అధికారులు స్పందిస్తూ చౌటూరి కోటమ్మను అర్హురాలుగా ప్రకటించారు.

కూతురే కొడుకై..



జంగారెడ్డిగూడెం బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీలో తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె ముప్పన జ్యోతి

జంగారెడ్డిగూడెం: కూతురే కొడుకై తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటన జంగారెడ్డిగూడెం పట్టణం బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీలో జరిగింది. ఆదిమూలపు వెంకటేశ్వరరావు (55) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. వెంకటేశ్వరరావుకు కొడుకులు లేరు. దీంతో కుమార్తె ముప్పన జ్యోతి అంత్యక్రియలు నిర్వహించింది. ఈ దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పాలకొల్లు యడ్లబజారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సత్తినీడి వీరన్న

యలమంచిలి: పాలకొల్లు యడ్లబజారు సెంటర్‌లోని ఫైర్‌స్టేషన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యలమంచిలి మండలం కాజ పడమర గ్రామానికి చెందిన సత్తినీడి వీరన్న(69) మరణించారు. ఆయన కాజ పడమర నుంచి తన బైక్‌పై పాలకొల్లు వెళ్తుండగా యడ్లబజారు సెంటర్‌లో ఫైర్ స్టేషన్ వద్దకు వచ్చాక వెనుకగా లారీ బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో అతని బైక్ లారీ ముందు భాగంలోకి దూసుకుపోయింది. లారీ బైక్‌తోపాటు వీరన్నను కొద్ది దూరం ఈడ్చుకుపోయింది. దీంతో ఆయన ప్రమాద స్థలంలోనే మరణించారు. స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేయడంతో వాహన సిబ్బంది వచ్చి వీరన్నను పరీక్షించి చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాలకొల్లు పట్టణ ఏఎస్సై శలా మార్లింగం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నాటుసారాపై దాడులు



సారా స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ఏలూరు టౌన్: నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడతామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎస్ నాగప్రభుకుమార్ హెచ్చరించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు, తన సిబ్బందితో నాటుసారా తయారీపై దాడులు చేశారు. శుక్రవారం లింగపాలెం మండలం మఠంగూడెం పరిధిలో నాటుసారా తరలిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 లీటర్ల నాటుసారా, రవాణాకు వినియోగించిన కారును సీజ్ చేశారు. తలార్లపల్లి గ్రామానికి చెందిన దేశవతు వేణు నాటుసారా తయారు చేస్తూ చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మఠంగూడెం గ్రామానికి చెందిన జెర్రిపోతుల మారేశు, తొచలక రాయుడు పాలెం గ్రామానికి చెందిన పెనమలూరి చంటమ్మను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వేణు సమాచారం మేరకు అతని ఇంటి సమీపంలో, పొలంలో తనిఖీలు చేయగా 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ భోగేశ్వరరావు తెలిపారు. ప్రగడవరం అడ్డరోడ్డులో కిరాణాషాపు నిర్వహిస్తున్న అద్దంకి విశ్వేశ్వరరావు బెల్లం విక్రయించినట్లు అంగీకరించటంతో 5 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని, అతనిపైనా కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.

ఆక్వాకు వాతావరణ గండం

- పగలంతా ఎండ, సాయంత్రం భారీ వర్షాలతో అనర్థం
- విద్యుత్ కోతలతో ఆయిల్ ఇంజిన్లు వాడుతున్న రైతులు



ఆక్వా చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్లు



ఆక్సిజన్ అందక చనిపోయిన రొయ్యలు

గణపవరం : పూటకో రకంగా మారుతున్న వాతావరణం ఆక్వా సాగుకు గుదిబండలా తయారైంది. ఈ వాతావరణం రొయ్య సాగుకు పూర్తి ప్రతికూలం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల దారుణంగా పడిపోయిన రొయ్యల ధరలు కొద్దిగా పెరిగి ఆక్వా సాగు కుదుట పడుతున్న సమయంలో గత రెండు వారాలుగా మళ్లీ రొయ్య ధర తగ్గిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో గత పది రోజులుగా నిలకడలేని వాతావరణం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పగలు ఉక్కబోత, విపరీతమైన ఎండలు ఓ పక్క, సాయంత్రానికి మబ్బులు కమ్మి, వర్షపు జల్లులు మరో పక్క ఆక్వా సాగును కుదేలు చేస్తున్నాయి.

ఈ సమస్యలకు తోడు ఎడాపెడా విధిస్తున్న విద్యుత్ కోతలు ఆక్వా రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు తిరగడానికి ఆయిల్ ఇంజిన్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఆయిల్ ఇంజిన్ల వినియోగానికి రోజూ వేల రూపాయల డీజిల్ కొనాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే నెలలో వర్షాలతో చల్లబడిపోగా, జూన్ విపరీతమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలతో మొదలైంది. ఉక్కబోత కారణంగా రొయ్యల చెరువుల్లో డీవో సమస్య ఏర్పడి సరిపడా ఆక్సిజన్ అందక నీటి ఉపరితలంపై తేలియాడుతున్నాయి. ఈ సమస్య మరీ తీవ్రమైతే రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో రైతులు ఆఘమేఘాల మీద రొయ్యల పట్టుబడి చేసి, నష్టాల పాలవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా 50 శాతం చెరువుల్లో అంటే 1.25 లక్షల ఎకరాల్లో రొయ్య సాగు చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో వాతావరణం ప్రతికూలంగా మారడంతో జూన్‌లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో రొయ్యలు అర్ధాంతరంగా పట్టుబడి చేసినట్లు అంచనా.

ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోవాలంటే..

రొయ్య సీడ్ నాణ్యత కలిగి ఉండాలి. నీటి పీహెచ్ స్థాయి సరైన మోతాదులో ఉండాలి. నిరంతరం ఆక్సిజన్ స్థాయిని సరి చూసుకుంటూ ఉండాలి. నీటి క్షార స్వభావం, నీటి కాఠిన్యం సరైన స్థాయిలో ఉండేలా చూడాలి. చెరువులో ప్రమాదకరమైన విష వాయువులు అమ్మోనియా నైట్రేట్, హైడ్రోజన్ సల్ఫైడ్ వంటివి తయారవకుండా చర్యలు తీసుకోవాలి. చెరువుల్లో రొయ్య పిల్ల సాంద్రతను బట్టి పాక్షిక పట్టుబడి చేసుకుంటే మిగిలిన రొయ్యలు ఒత్తిడికి గురి కాకుండా స్వేచ్ఛగా పెరగడానికి అవకాశం ఉంటుంది.

మత్స్యశాఖ అధికారుల సూచనలు

చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ నీటిని రీ సైక్లింగ్ చేయాలి. ఆక్సిజన్ లోపం నివారణకు పొటాషియం పర్మాంగనేట్ సిద్ధంగా ఉంచుకుని, అవసరం మేరకు చెరువుల్లో చల్లుతుండాలి. ఆక్సిజన్ సరిపడా అందకపోవడంతో చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినని కారణంగా పరిమితంగా మేతలు వేస్తుండాలి. ఆక్సిజన్ సమస్య ఉన్న సమయంలో చెరువుల్లో మేత, సేంద్రియ ఎరువులను వేయడం పూర్తిగా మానేయాలి. చెరువుల్లో మినరల్స్ ఎక్కువగా వినియోగించకూడదు. నీటి పరీక్షలు చేయించి చెరువులలో అమ్మోనియా స్థాయిని నిర్ధారించుకోవాలి.

కాలినడక భక్తులకు సౌకర్యాల కల్పన





కొండపైన డార్మెటరీలో మంచాలపై నిద్రిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల : ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో కాలినడక భక్తులకు దేవస్థానం పెద్దపీట వేసింది. వృద్ధ, దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం కొండపైన డార్మెటరీలో సుమారు 50 మంచాలను ఏర్పాటు చేసింది. చిన వెంకన్న దివ్య క్షేత్రానికి ప్రతి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కాలినడకన వస్తున్నారు. వారంతా శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శిస్తున్నారు. కాలినడక భక్తులకు సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించిన దేవస్థానం డార్మిటరీల ద్వారా వసతి సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలోనే వృద్ధ, దివ్యాంగ భక్తులకు డార్మెటరీలో మంచాలు ఏర్పాటు చేసింది. ఒక్కో భక్తుడి నుంచి రూ.20 నామమాత్రపు రుసుం వసూలు చేస్తోంది. వస్తువులను భద్రపరచుకునేందుకు లాకర్ సదుపాయం కల్పించారు.

112 బస్సులపై కేసులు



కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రవాణా కమిషనరు ఆదేశాల మేరకు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కలపర్రు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించి.. 112 కాంట్రాక్టు క్యారేజ్ బస్సులు, వాణిజ్య, వాణిజ్యేతర వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.3.67 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఇన్‌చార్జ్ ఉప రవాణా కమిషనరు కేఎస్ఎంవీ కృష్ణారావు తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య తిరిగే కాంట్రాక్టు బస్సులను తనిఖీ నిర్వహించి పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. వాణిజ్య వాహనాలపై పన్ను చెల్లించకుండా, పర్మిట్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి లేకుండా నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక తనిఖీల్లో జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జ్ ఆర్టీవో ఎస్.రంగనాయకులు, వాహన తనిఖీ అధికారులు జీ ప్రసాదరావు, జీ స్వామి, వై సురేష్ బాబు, కళ్యాణి, కృష్ణవేణి, అన్నపూర్ణ, డీ ప్రజ్ఞ పాల్గొన్నారు.

మార్టేరు పరిశోధన స్థానంలో పదోన్నతులు



మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి పదోన్నతి పొందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

పెనుమంట్ర: మార్టేరు ప్రాంతీయ పరిశోధన స్థానంలో వివిధ విభాగాల్లో శాస్త్రవేత్తలుగా పని చేస్తున్న ఎనిమిది మంది శాస్త్రవేత్తలకు ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా పరిశోధన స్థానంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఆత్మీయ సమావేశంలో బంగారు పతకం అందుకున్న డాక్టర్ టి.శ్రీనివాస్ తో పాటు డాక్టర్ బి.సహదేవరెడ్డి (పంటల యాజమాన్య విభాగం), డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ పి.రాధిక (కీటక శాస్త్ర విభాగం) సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందగా.. డాక్టర్ ఎం.గిరిజా రాణి, డాక్టర్ వై సునీత(మొక్కల ప్రజనన విభాగం) ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. డాక్టర్ పీవీ రమేష్ బాబు(పంటల యాజమాన్య విభాగం). డాక్టర్ వీ రోజా (మొక్కల ప్రజనన విభాగం) అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

క్లుప్తంగా

ప్రజలకు సేవలందించడమే లక్ష్యం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ఆర్డీవో ఖతీబ్, చిత్రంలో తహసీల్దార్ సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కాశీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వీఆర్వో అసోసియేషన్ సంఘ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: రెవెన్యూ విభాగంలో ప్రజలకు అవసరమైన సేవలను సత్వరమే అందజేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది కృషి అభినందనీయమని తణుకు తహసీల్దార్ దండు అశోక్‌వర్మ అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీషు వారి హయాంలో 1768 జూన్ 20వ తేదీన రెవెన్యూ బోర్డును ఏర్పాటు చేసిన సందర్భంగా రెవెన్యూ దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా గతేడాది ప్రకటించినట్లు స్పష్టం చేశారు. ముందుగా రెవెన్యూ సర్వీసులతో పాటు రికార్డులను ప్రదర్శించారు. అనంతరం రెవెన్యూ విభాగంలో అత్యుత్తమ సేవలందించి రిటైర్ అయిన ముగ్గురిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఎస్.శ్రీదేవి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.గౌతమి, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

తణుకు అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఎంకే సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతాల్లో యోగా ఒకటని, 5వేల సంవత్సరాల పురాతనమైన యోగా విద్య శారీరక, మానసిక శ్రేయస్సుకు దోహదపడుతుందని అన్నారు. అనంతరం 2024–25 సంవత్సరంలో డిప్లమో ఇన్ యోగలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ధ్రువపత్రాలు అందజేశారు.

అత్తిలిలో ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

అత్తిలి: ప్రభుత్వ పరంగా ఎన్ని శాఖలు ఉన్నా రెవెన్యూ శాఖ గుండెవంటిదని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం అత్తిలిలో నిర్వహించిన రెవెన్యూ డే కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్ దశికవంశీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ డేను జూన్20ని ప్రకటించి ప్రతి ఏడాది జరిపేలా ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొనకళ్ల విజయనిర్మల కాంతారావు, స్థానిక నాయకులు ఆళ్తి అజయ్ కుమార్, ఆనాల ఆదినారాయణ, ఆళ్తి సత్యనారాయణ, సిరగాని నాగేశ్వరరావు, కొరిపల్లి హరి, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్టు ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ప్రతి నెల బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగం ఆర్గ నైజేషన్ ఫౌండర్ త్రికళ ఆధ్వర్యంలో శుక్రవారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీల బియ్యం, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు 150 కేజీలు బియ్యం, నిడదవోలు లెప్రసీ కాలనీకు 300 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పెంటపాడు: మండలానికి మండల వ్యవసాయాధికారి కె. పార్థసారది గూడెం వ్యవసాయ శాఖ లాబ్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో భీమడోలులో ప్రయోగశాలలో పనిచేసిన చీర్ల రవికుమార్ పెంటపాడు వ్యవసాయాధికారిగా బదిలీపై వచ్చారు. శుక్రవారం చీర్ల రవికుమార్ మండల వ్యవసాయాధికారి బాధ్యతలు స్వీకరించారు.

పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బీవీఆర్ కళాకేంద్రంలో బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 నగదు, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్స్ అందజేశారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం విద్యాశాఖ అధికారులు టీవీ రామకృష్ణ, జ్యోతిలు పాల్గొన్నారు.

మురికి కూపంగా కొమ్మాయిచెర్వు

- పిచ్చిమొక్కలు, పచ్చగడ్డితో వాకింగ్ ట్రాక్
- గత ప్రభుత్వ హయాంలో ఆహ్లాదంగా ఉండే కొమ్మాయిచెర్వు ప్రాంతం
- మద్యం సీసాలు, తాగిపారేసిన వాటర్ గ్లాసులు, ప్యాకెట్స్



తణుకులో మురికికూపంగా మారిన కొమ్మాయిచెర్వు



తణుకు కొమ్మాయిచెర్వులో మందుబాటిల్స్, వాటర్ ప్యాకెట్స్

తణుకు అర్బన్: తణుకు పాతవూరులోని కొమ్మాయిచెర్వు మురికికూపంగా మారిపోయి దుర్గంధంగా తయారైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయిలు వెచ్చించి కొమ్మాయిచెర్వును సుందరంగా తీర్చిదిద్దారు. చెరువు చుట్టూ రివిట్‌మెంట్‌తో పాటు వాకింగ్ ట్రాక్, మెష్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఆనుకుని చెరువు ఉండడం నీటి ప్రవాహం రోడ్డుపైకి వస్తున్న నేపథ్యంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఈ చెరువును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పచ్చని మొక్కలు నాటించి స్థానికులకు ఉపయోగపడేరీతిలో పచ్చదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ఆవిష్కరింపచేశారు. దీంతో చెరువు చుట్టూ నివసించే వారితోపాటు స్థానికులు సాయంత్రం సమయంలో వాకింగ్ ట్రాక్‌లో వాకింగ్ చేయడంతోపాటు పిల్లలను తీసుకువచ్చి ఆహ్లాదంగా గడిపేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి ఎటువంటి సంరక్షణ లేకపోవడంతో చెరువు ప్రాంతం మళ్లీ గతంలో మాదిరిగా మురికికూపంగా మారిపోయింది. అంతేకాకుండా ఎటువంటి మెయింటెనెన్స్ లేకపోవడంతో విషసర్పాలకు నిలయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

చీకటిపడితే మందుబాబుల హల్‌చల్

పాతవూరు ప్రాంతానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉండే ఈ కొమ్మాయిచెర్వు నేడు మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. మొక్కలు ఏపుగా ఎదగడం, పిచ్చిమొక్కలు పెరగడంతో వాకింగ్ చేసేందుకు ప్రజానీకం రాకపోవడంతో ప్రస్తుతం చీకటి పడితే చాలు మందుబాబుల తాకిడికి మందుకంపు కొడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు ప్రాంతమంతా నేడు మద్యం బాటిల్స్‌తో పాటు తాగిపారేసిన వాటర్ ప్యాకెట్స్, గ్లాసులతో అపరిశుభ్రంగా మారిపోయింది. పాతవూరు నడిబొడ్డున ఉన్నప్పటికీ స్థానిక నేతలు సైతం చెరువు వైపు చూసీచూడనట్లుగా వెళ్లిపోతున్నారని స్థానికంగా ఉండలేకపోతున్నామంటూ మహిళలు గగ్గోలు పెడుతున్నారు. రాత్రి సమయంలో ఒక దాబా, బార్ మాదిరిగా మారిపోతుందని వాపోతున్నారు.



తణుకు కొమ్మాయిచెర్వులో పచ్చగడ్డితో వాకింగ్ ట్రాక్



తణుకు కొమ్మాయిచెర్వులో పిచ్చిమొక్కలు, మురుగు నీటితో నిండిన దృశ్యం

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నిరసన ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ కోరారు. పట్టణంలో శుక్రవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న హామీ ఇచ్చి సంవత్సరం దాటిని అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయరాజు, విజయ్, సయ్యద్ భాష, అసిన్ భాష, వెంకన్న, నాగేశ్వరరావు, రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికపై సభలో చర్చించారు. ఎంపీటీసీ దూలపల్లి సత్తియ్య, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ చిటకన శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదిగంటల పనిదినాన్ని రద్దు చేయాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ వ్యాప్తంగా పనిగంటల తగ్గిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో పదిగంటల పనిదినాన్ని ప్రవేశ పెట్టాలని చూడటం దారుణమని, మారిన వాతావరణం, ఆహార అలవాట్లు, ఆరోగ్య పరిస్థితుల్లో రాష్ట్రంలో ఆరు గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. పదిగంటల పనిదినాన్ని ప్రవేశ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించడానికి నిరసనగా శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనుబంధ కార్మికులు మునిసిపల్, ఏరియా ఆసుపత్రి, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కార్మికులు నినాదాలు చేశారు.

తణుకు అర్బన్: రాష్ట్ర మంత్రివర్గం కార్మికుల పనిగంటలు ఎనిమిది నుంచి పది గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం తక్షణమే ఉపసంహరించుకోవాలని కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. పనిగంటల పెంపు రాత్రి సమయాల్లో మహిళలు పనిచేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం సీఐటీయు, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో తణుకు నరేంద్ర సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం కార్మికులను కట్టు బానిసలను చేస్తూ సంపన్న బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారని విమర్శించారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించాలి



సూరంపూడిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఇరగవరం: యోగాంధ్ర సరే ఉపాధి కూలీలకు వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారు అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని సూరంపూడి గ్రామంలో పని చేస్తున్నా కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇంకా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదన్నారు. తక్షణమే ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో కూలీలతో యోగా చేయించడం మీద ఉన్నా శ్రద్ధ వేతనాలు చెల్లించడం మీద లేకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని లేకుంటే కూలీలను ఐక్యం చేసి ఉద్యమ పోరాటలకు సిద్ధం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు అంక రాణి, బొల్లా మౌనిక, మట్ట వెంకట లక్ష్మీ, బొల్లా పద్మ, ఆరేపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్య భద్రత సాధించవచ్చునని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ఆరోగ్య కేంద్రం పరిధిలో 30, 31, 32, 33, 34, 35 వార్డులలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం వెక్టార్ కంట్రోల్ హైజీన్ పరిశీలన, మలేరియా మాసోత్సవాల అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు దోమ లార్వా దశలోనే అంతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య కార్యకర్తలు చిన్నపాప, కృపమ్మ, కనకరత్నం, రాజేశ్వరీ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు స్వాతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్–ఇరాన్ యుద్ధాన్ని ఆపాలని నిరసన



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇజ్రాయిల్–ఇరాన్ యుద్ధాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. యుద్ధం వద్దు, శాంతి ముద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ నెలలు తరబడి యుద్ధం చేస్తుందని, ఇప్పటి వరకు 60 వేల మంది చనిపోయారని, పిల్లలు, వృద్ధులు, మహిళలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధాలు వల్ల ప్రపంచంలోని అన్ని దేశాలు నష్టపోతాయని చెప్పారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ నిత్యావసర ధరలు ఇప్పటికే పెరిగాయని, యుద్ధం కారణంతో ధరలు మరింత పెంచుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ధరలు పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలానీ, అబ్దుల్లా, జవ్వాది శ్రీను, మడకా రాజు, శిద్దిరెడ్డి శేషుబాబు, యండమూరి నాగేంద్ర, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పెంటపాడు: చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ఫ్యామిలీ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఆమె కాగులంపాడు అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. వారితో పాటు, గ్రామంలో చిన్నారులు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గాభవాని పాల్గొన్నారు.

సకల రోగ నివారిణి యోగా

- దినచర్యగా పాటిస్తున్న ప్రజానీకం
- యోగ, ప్రాణాయామం సంజీవనితో సమానమంటున్న గురువులు
- తణుకు ఎన్జీవో హోంలో ఉచిత యోగాభ్యాసన
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం



తణుకులో యోగాసనాలు చేయిస్తున్న యోగ గురువు శ్రీనివాసరెడ్డి



తణుకులో ప్రాణాయామం చేస్తున్న చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సకల రోగ నివారిణిగా మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగ నిత్య ఔషధమని నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ యోగ బాటపట్టాల్సిందేనని యోగ గురువులు, వైద్యులు సైతం చెబుతుండడంతో నిజజీవితంలో నేడు యోగను దినచర్యగా అధికశాతం పాటిస్తున్నారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేటి రోజుల్లో యోగ సంజీవనిలా పనిచేస్తుందనే ప్రచారంతో పాటు అందుకు సంబంధించి ఫలితాలు కూడా కనిపిస్తున్న నేపథ్యంలో ఉదయాన్నే యోగ, ప్రాణాయామం చేసేందుకు ప్రజానీకం ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా కొన్నిరకాల యోగాసనాలు కీళ్ల నొప్పులు ఇతర రుగ్మతలను నయం చేస్తుండగా ప్రాణాయామం మాత్రం ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపరుస్తుందనేది యోగా గురువుల వాదన. తణుకులో ఉదయాన్నే యోగ మ్యాట్‌లు పట్టుకుని యోగాభ్యాసన కోసం ఉదయాన్నే ప్రజలు యోగ సెంటర్లకు పయనిస్తున్నారు. ఇందులో భాగంగా తణుకు ఎన్జీవోస్ హోంలో యోగ గురువు కర్రి శ్రీనివాసరెడ్డి గత 25 ఏళ్లకు పైగా ఉచితంగా యోగా శిక్షణ నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఎన్జీవో హోంలో యోగా శిక్షణ తరగతులకు వచ్చే యోగాభ్యాసకులకు యోగ గురువు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులతో పాటు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు వేలాదిమందికి యోగ నేర్పించి పలు అవార్డులు అందుకున్నారు.

యోగ సంజీవని

నిత్య యోగద్వారా మానవ దేహంలోని కండరాలు, నరాల పనితీరు మెరుగుపడడమే కాకుండా ప్రతి అవయవంలోను స్పందన వస్తుందని యోగ గురువులు చెబుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలను యోగాతో నయం చేసుకోవచ్చని, ముఖ్యంగా సుగర్, బీపీతోపాటు మలబద్ధకం, గ్యాస్, థైరాయిడ్ వంటి రోగాలను యోగ అదుపులో ఉంచుతుందని వైద్యులు కూడా చెబుతున్నారు. ఒక్కో భంగిమలో చేసే యోగాసనం ఒక్కో రకమైన శరీర సమస్యకు పరిష్కారం చూపుతుందంటూ యోగ గురువులు ప్రయోగాత్మకంగా చూపిస్తుండడం విశేషం.

వేలాది మందికి యోగాభ్యాసన చేయించిన తృప్తి ఉంది



గత 30 ఏళ్లుగా తణుకుతోపాటు పలు ప్రాంతాల్లో ఉచితంగా యోగా నేర్పిస్తున్నాను. మానవాళి మనుగడకు యోగా నిత్య ఔషధిలాంటిది. తణుకు ఎన్జీవోస్ హోంతోపాటు పలు గ్రామాలకు వెళ్లి యోగా తరగతులు నిర్వహించి ఇప్పటి వరకు కొన్ని వేల మందికి ఉచితంగా యోగా నేర్పించిన తృప్తి నాకు కలిగింది. పది మంది ఒకే చోట ఉంటే చాలు యోగా నేర్పిస్తాననే నా ప్రచారం జిల్లా నలుమూలలా తాకింది. ఇదే స్ఫూర్తితో అందరికీ యోగాను అందించగలుగుతున్నాను. యోగాలో ఉండే వివిధ రకాల యోగాసనాలు శరీరంలోని ఒక భాగంలో స్పందింపచేసి వాటి పనితీరును మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా ప్రాణాయామం అంటే ప్రాణం నిలిపేదిగా భావించాలి. ప్రాణాయామం ద్వారా మూసుకుపోయిన ఊపిరితిత్తుల్లో చలనం తెప్పించి పూర్వపు స్థితికి తీసుకువచ్చే అద్భుతమైన ప్రక్రియగా భావించాలి.

– కర్రి శ్రీనివాసరెడ్డి, యోగా గురువు, తణుకు–

అందరి సమన్వయంతోనే యోగాంధ్ర విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఎం.ప్రభాకర్

తాడేపల్లిగూడెం రూరల్: అందరి సమన్వయంతోనే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడానికి ప్రతి ఒక్కరినీ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ డీఈ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఇరగవరం: మండలంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి వీ.వీ.నాగ రాజారావు అన్నారు. శుక్రవారం యోగా కార్యక్రమంపై మండలంలోని మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 21న ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని 21 గ్రామాల నుంచి 36,814 మంది యోగాంధ్ర 2025లో పాల్గొనడానికి రిజిస్టర్ అయ్యారన్నారు. ప్రతి గ్రామానికి ఒక మండల స్థాయి అధికారిని పర్యవేక్షకుడిగా నియమించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా ఈ యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్ రక్షణకు చర్యలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ఎస్సీ బాలికల హాస్టల్ శిథిలావస్థకు చేరడంతో పెంటపాడులో ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులు తలదాచుకుంటున్నారు. అయితే హాస్టల్ రిపేర్ల కోసం అధికారులు రూ. 40 లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈలోగా ఆదర్శపాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో తాత్కాలికంగా మరోభవనాన్ని పరిశీలించే క్రమంలో జిల్లా అధికారి శుక్రవారం సాయంత్రం పెంటపాడు విచ్చేసి స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న ఆర్బీకే భవనాన్ని పరిశీలించారు. ప్రస్తుతం 30 మందిపైగా బాలికలు హస్టల్ లో ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రాజు మాట్లాడుతూ ఆర్బీకే భవనం అనుమతి కోసం వ్యవసాయ శాఖ అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో అన్నదానం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు చిక్కాల గంగయ్య కుమారుల ఆధ్వర్యంలో సుమారు 300 మందికి అన్నదానం చేశారు.